కథ

# వసంత కాలమే హాయ్... హాయ్...

''హేపీ న్యూ ఇయర్''

''హేపీ న్యూ ఇయర్''

కొత్త సంవత్సరానికి హడావిడిగా స్వాగతం పలుకుతున్నారు జనం. మా కాలనీలో ప్రతి సంవత్సరం జరిగే న్యూ ఇయర్ పార్టీ ఇది. 'చూపులతో గుచ్చి గుచ్చి చంపకే... మేరె హాయ్...'

పిల్లలంతా రికార్డులు పెట్టుకుని ఒళ్లు అలసిపోయేట్లు వూగుతున్నారు.

''దేవికగారూ! ఒక్కరే నిలబడ్డారే?'' అంటూ మిసెస్ చౌదరి నా దగ్గరకొచ్చింది.

'పలుకు తేనెల తల్లి పవళించి యున్నది' అనే పాట ఎక్కడ నుండో తేలి వస్తుంటే ఇక్కడ నిలబడి వింటున్నాము.. అని చెప్తే బావుంటుందా అని ఆలోచించి, చెప్పలేక నవ్వేశాను.

''రండి.. ఈ ఒక్కరోజూ డాన్స్ చేద్దాం. మనసుకీ శరీరానికీ హాయిగా వుంటుంది'' నా చెయ్యి పట్టుకుని అందావిడ.

''నేను డాన్సా?'' ఒక్క నిమిషం తెల్లబోయాను.

''ఆ.., మీరే...'' ఆవిడ నన్ను లాక్కొని వెళుతూ అంది.


డాన్స్ అనగానే చిన్నతనంలో స్కూల్లో చేసిన 'అందాల బొమ్మతో ఆటాడవా' అనే డాన్స్ గుర్తొచ్చింది. 'కనులు... చేపలయి... గెంతులు వేసెను' అన్నప్పుడు చెయ్యి వెనక్కి తిప్పి, దాని మీద ఇంకో చేతిని వుంచి వేళ్లు చేపపిల్లలా కదుపుతూ గెంతులు వేసాం. ఇప్పుడు ఈ పిల్లల్లా ఎలా వూగాలో... ఏం తిప్పాలో అప్పటి మా పెద్దవాళ్లు చెప్పలేదు.

సునంద మూడేళ్ల కూతురు 'భావలు సయ్యా...' అనే పాటకి ఇరవయ్యేళ్ల అభినయం ప్రదర్శించింది ఆమధ్య. దానికి సునందా, ఆమె భర్తా తెగ మురిసిపోయారు.

'డోరారె... డోలారె... డోలారె... డోలా... మన్ డోలా... తన్‌డోలా...'

''కమాన్ మేడం. డాన్స్.. ఎంజాయ్'' డాక్టర్

బలభద్రపాత్రుని రమణి



విలియమ్స్ చప్పట్లు కొడుతూ నన్ను ఎంకరేజ్ చేసారు.

నలభై ఏళ్లు దగ్గర పడుతుంటే ఒక పెద్ద కంపెనీకి జనరల్ మేనేజర్‌గా వున్న నేను డాన్స్ చేయడం ఏమిటి? అసలందుకే నేనిలాంటి చోట్లకి రాను.

''ప్లీజ్... ఎక్స్‌క్యూజ్‌మీ...'' అని దూరంగా వెళ్లాను.

అరవై ఏళ్ల పార్సీ ఆవిడా, ఆవిడ కోడలూ పోటీపడి చేసేస్తున్నారు. ఆవిడ భర్త, మార్నింగ్ వాక్‌కి కుంటుతూ వెళ్లే ఆయన సైతం నిలబడ్డ చోటే వూగుతూ చప్పట్లు కొట్టి హుషారు చేస్తున్నాడు.

వాళ్లందరి మధ్యా నేను చాలా ఫారెన్‌గా ఫీలయ్యాను.

అందుకే గిరిజ ''నువ్వు నత్తగుల్లవి. నిన్నెవరైనా టచ్ చేస్తే ముడుచుకుపోతావు'' అంటుంది.

నిజమే. నలభై ఏళ్లలో చిన్నప్పటి స్నేహితురాళ్ని

తప్పు ఇంకో ఫ్రెండ్‌ని వెతుక్కోలేకపోయానంటే... అంతేగా మరి!

కానీ నేను మొదటి నుంచీ ఇలా లేను. కాలేజీలో 'దేవీ... దేవీ' అంటూ ఏ ప్రోగ్రామ్ అయినా ఫంక్షన్ అయినా నా పేరు మార్మోగిపోయేది. నేను కాటన్ చీర కడ్తే, ఆ చీరకే అందం వచ్చేదని అమ్మాయిలు సైతం అనేవారు. డ్రెస్సింగ్, అలంకరణ అన్నీ శ్రద్ధగా చేసుకునే దాన్ని. చుట్టూ పదిమంది లేకుండా ఇలా ఒంటరిగా నడిచిన రోజే జ్ఞాపకం లేదు. ఇప్పుడు చుట్టూ వంద మంది వున్నా ఒంటరిగా మిగిలిపోయాను.

''మమ్మీ''

నా ఆలోచనల్లోంచి వర్తమానంలా కళ్లెదుట రాహుల్ నిలబడి వున్నాడు. పాతికేళ్ల కొడుకు! పక్కనే తెల్లని చుడీదార్‌లో ఒక అమ్మాయి!

''అమ్మా! అస్మిత. స్మితా.. షీ ఈజ్ మై మామ్'' పరిచయం చేశాడు.

ఆ అమ్మాయి ''నమస్తే ఆంటీ'' అని నవ్వింది.

''నమస్తే'' తల వూపాను.

''రాహుల్. కమాన్ యార్. వై సో లేట్?'' అని ఎవరో గుంపులోంచి అరిచారు.

''కమాన్ డార్లింగ్'' అస్మితని లాక్కెళ్లిపోయాడు రాహుల్.

నేను మళ్లీ ఒంటరిగా మిగిలాను.

భరద్వాజని నేను పెళ్లి చేసుకున్నప్పుడు వాళ్లింట్లో అర డజను మంది మనుషులుండేవారు.

''నువ్వెంత పెద్ద చదువులు చదివినా... ఇంజనీర్ వైనా, ఇంట్లో మాత్రం పెద్ద కోడలివి. జ్ఞాపకం పెట్టుకో'' అన్నాడు మొదటి రాత్రి.

ప్రతి రాత్రీ నాకు గుర్తుచేస్తూనే వుండేవాడు. అంతమందున్నా నేనెప్పుడూ నా ఆలోచనల్లో ఒంటరిగానే వుండేదాన్ని. నన్ను అర్థం చేసుకునే ప్రియనేస్తాలు పుస్తకాలే అనిపించేవి.

రాహుల్ పుట్టడం చాలా ఆలస్యం అయింది. ఆలోగా అత్తగారు నా చేత చాలా చెట్లకి ప్రదక్షిణాలు చేయించి, మంత్రాలు వేయించి, నోములు నోయించారు.

ఈ సమయంలో నేను డాక్టరేట్ తీసుకున్నాను.

ఒక్కొక్క మెట్టే ఎదిగాను. వెనక్కి తిరిగి చూస్తే భరద్వాజ తల్లి వడియాలు పెడుతుంటే పక్కన కూర్చుని అక్కాచెల్లెళ్ల గురించీ, వాళ్ల కాపురాల గురించీ కబుర్లు చెప్తుండేవాడు.

రాహుల్ పుట్టాడు. అత్తమామలు పోయారు. భరద్వాజా, నేనూ ఒంటరిగా మిగిలాము. ఒంటరితనం ఏవిటీ ఇద్దరి మధ్యా... అదంతే!

నా చూపు అస్మిత మీద పడింది. ఆమె జుట్టు ఎంత అందంగా వూగుతోందీ! రాహుల్ మీద పడినప్పుడల్లా ఎంత అందంగా నవ్వుతోందీ. రాహుల్‌కి ఈ వయసులో కావల్సింది నా తోడూ నా కంపెనీ కాదు. ఇలాంటి కంపెనీ!

చాలామంది మగవాళ్లు ఆరోజు ధైర్యంగా భార్యల ముందే డ్రింక్స్ తీసుకుంటున్నారు. మిసెస్ చౌదరీ, ఉషా, కిరణ్‌లు కూడా డ్రింక్ చేస్తున్నారు.

ఎన్నోసార్లు... ఆ అలవాటున్నా బావుండున్ను అనిపిస్తుంది. కాసేపు మనసు నిద్రపోతుంది.

చుట్టూ చాలా గోలగోలగా వుంది.

తప్పదు. చెట్ల ఆకులన్నీ రాల్చేసి దిగులుగా నిలబడ్డ శిశిరంలో వసంతాన్ని తేవాలంటే ఇంత హంగామా చెయ్యాల్సిందే!

తాళపత్రాల నుంచి కంప్యూటర్ల స్థాయికి ఎదిగామనా ఈ గర్వం?

''ఆంటీ రండి. డాన్స్ చేద్దాం'' అస్మిత సడెన్‌గా వచ్చి చెయ్యి పట్టుకుని అంది.

''నేనా! నో యూ కేరీ ఆన్'' సున్నితంగా తప్పించుకోచూసాను.

''ప్లీజ్ ఆంటీ. ఈరోజు అలా అనకూడదు'' శాసనంలా అంది.

''నాకు రాదమ్మా''

''నేను నేర్పిస్తాను.. రానిదేదీ ఈ లోకంలో అసలు లేదు''

ఉలిక్కిపడ్డాను.

నేను భరద్వాజతో ఇరవై సంవత్సరాలు ఇలాగే అంటూ వచ్చాను.

''బాబుకి డ్రెస్ చేంజ్ చేయాల్సింది''

''నాకు రాదు''

''వచ్చేటప్పుడు కూరలు తీసుకురండి''

''నాకు రాదు''

''ఆ జాబ్ రిజైన్ చేసేసి మా కంపెనీలో సేల్స్ సైడ్‌కి వచ్చేయండి. ప్రాస్పెక్ట్స్ బావుంటాయి''

''నాకు సేల్స్‌మెన్‌షిప్ లేదు''

''ప్రయత్నించండి''

''నాకు రాదు''

''రానిదేదీ ఈ లోకంలో సృష్టింపబడలేదండీ. పుట్టగానే నాకు వంట చెయ్యడం వచ్చా? పిల్లల్ని కనడం, పెంచడం వచ్చా? కారు నడపడం వచ్చా?''

ఆపాటికే అతను అక్కడి నుంచీ వెళ్లిపోయేవాడు.

''కమాన్ ఆంటీ!'' అస్మిత నన్ను చనువుగా తీసుకెళ్లింది.

నా దగ్గరగా ఒంగి చెవిలో చెప్పినట్టు అంది- ''డాన్స్ మనసుకీ శరీరానికీ ఎంత రిలాక్సేషన్ ఇస్తుందో తెలుసా? ఇలా నా నడుం పట్టుకుని ప్రతి అవయవాన్నీ వూపండి. నెమ్మది నెమ్మదిగా స్పీడ్ పెంచాలి. దట్స్ గుడ్.. కమాన్''

'డోలారె... డోలారె... డోలారె.. డోలా'

నా మనసంతా దూదిపింజెలా వూగుతోంది. అందరూ ఇందాకటి నుంచీ అంత సంతోషంగా ఎలా వున్నారో అర్థం అవుతోంది. శరీరం, వయసు, హోదా, గతస్మృతులూ అన్నీ మరిచి వూగుతోంది.

గడిచిన పాతిక సంవత్సరాలని ఒక నెట్టుతో తోసిపారేసింది అస్మిత!

''హౌ ఈజ్ ఇట్?'' నాకు ఆరెంజ్ జ్యూస్ అందిస్తూ అడిగింది.

పద్దెనిమిదేళ్లప్పుడు దేవిక తెలుగు మేడంని ఉయ్యాల్లో కూర్చోపెట్టి వూపుతూ చేసిన అల్లరి ఆమెలో కనిపించింది.

అస్మిత... నా ప్రతిబింబం. నేను పారేసుకున్న నా గతం. ఆ ఉత్సాహం, ఉల్లాసం... దగ్గరగా తీసుకుని తలమీద ముద్దు పెట్టుకున్నాను.

''నాకో'' రాహుల్ పరిగెత్తుకొచ్చాడు.

''జెలస్'' వాడి నెత్తి మీద మొట్టికాయ వేసి నవ్వింది అస్మిత.

★ ★ ★

అస్మిత హాస్టల్లో వుండి మైక్రోబయాలజీలో పీజీ చేస్తోంది. యూనియన్లలో హడావిడి చేసే మా రాహుల్‌గాడికి అలాగే పరిచయం అయిందట.

తరచూ ఈమధ్య ఇంటికి వస్తున్నట్టుంది. ఇంట్లో పనివాళ్లకి కూడా తెలుసు.

ఒకరోజు కార్లో అస్మితని ఇంటికి తీసుకొచ్చాడు రాహుల్.


''మమ్మీ స్మితకి చాలా జ్వరంగా వుంది'' అన్నాడు.

''పైన గెస్ట్ రూంలో పడుకోబెట్టు'' అన్నాను.

ఆరోజు ఆఫీసుకెళ్లాకా ఆ అమ్మాయి గురించి ఇంటికి రెండు మూడు ఫోన్లు కూడా చేసాను. రాహుల్ చాలా కేర్ తీసుకున్నాడు. జ్వరం నార్మల్‌కొచ్చేదాకా వాడు భోజనం కూడా చెయ్యలేదు.

అస్మిత నాకు పరాయిగా అనిపించడం మానేసింది.

సెలవురోజున నాతో షటిల్ ఆడుతుంది. లైబ్రరీ నుంచి పుస్తకాలు తెచ్చిచ్చి డిస్కస్ చేస్తుంది. ఒక్కోసారి పంజాబీ వంటలు చేసి వడ్డిస్తుంది. అస్మిత లేకపోతే



నాకూ తోచడం లేదు.

రాహుల్ అయితే ఆమెని ఒక్క నిమిషం వదలిపెట్టడు వస్తే. పరీక్షలని కొన్నాళ్లు రాలేదు. వీడు బెంగతో చిక్కిపోయాడు.

అస్మిత ఫోన్ వస్తే ఈ మాటే చెప్పాను.

అస్మిత నవ్వేసింది కానీ కళవెళపడి పరిగెత్తుకు రాలేదు.

★ ★ ★

నేను అనుకున్న పరిస్థితి ఒకనాడు రానే వచ్చింది. అస్మిత పెళ్లి విషయం ప్రస్తావించింది.

''రాహుల్ అంటే నాకు ఇష్టం. అతనికి నేను ప్రాణం'' అంది అస్మిత.

''రాత్రికి మాట్లాడదాం. ఇప్పుడు నా ఆఫీస్‌కి టైం అయింది'' అని నేను వెళ్లిపోయాను.

ఆరోజు ఆఫీసుకే డ్రైవర్ చేత బ్రీఫ్‌కేస్ తెప్పించుకుని ఢిల్లీ వెళ్లిపోయాను.

ఢిల్లీ నుంచి వచ్చాకా కూడా వారం రోజులు అస్మితని అవాయిడ్ చేశాను.

ఒకరోజు హఠాత్తుగా ఆఫీసుకొచ్చేసింది.

''ఆంటీ... నాకు జవాబు కావాలి. మా క్యాస్ట్, కమ్యూనిటీ వేరని మీరు ఆలోచిస్తున్నారా?'' అని నిలదీసింది.

అందమైన అస్మిత ఉద్రేకంలో మరింతగా మెరిసిపోతోంది.

''కూర్చో'' అని బోయ్‌ని పిలిచి కూల్‌డ్రింక్ తెప్పించాను. సెక్రటరీకి ఫోన్స్ ఏవీ లోపలికి ఇవ్వద్దని చెప్పాను.

అస్మిత సీరియస్‌గా చూస్తూ అంది ''మీరు నెగటివ్‌గానే ఏదో చెప్తారనుకుంటా''

ముందే తొందరపడడం... ఎదుటి మనిషి ఆలోచనలు చదివెయ్యడం.. అన్నీ నా అలవాట్లే!

''అస్మితా! ఐ లవ్ యూ!'' సంభాషణ ఇలా తప్పు మొదలుపెట్టలేనని నాకు ముందే తెలుసు.

''ఇప్పుడు నేను చెప్పబోయేది నీకు కొత్తగా, వింతగా, కొంత తప్పుగా కూడా వుండొచ్చు. కానీ నాకు చెప్పక తప్పదు. రాహుల్‌ని నువ్వు ప్రేమించావు. వాడికీ నువ్వంటే ప్రాణం. ఒకరి కళ్లల్లోకి ఒకరు చూసుకుంటూ, ఒకే కప్పులోంచి ఐస్‌క్రీమ్ తింటూ, ఒకరికి జబ్బు చేస్తే ఒకరు కన్నీళ్లతో దగ్గరుండి సేవచేస్తూ, ఇవన్నీ ఇప్పుడు బాగానే వుంటాయి. కానీ రియల్ ట్రబుల్ రేపు పెళ్లయ్యాకా స్టార్ట్ అవుతుంది. నేనూ నీలాగే వుండేదాన్ని. టూ ఏంబిషియస్. ఏదో చేసెయ్యాలనే తపనతో. రాహుల్ తండ్రికి జీవితంలో మార్పంటే భయం. దానికి ఆయన 'తృప్తి' అనే పేరు పెట్టుకున్నారు. 'ఇప్పుడున్నది బావుంది కదా. కొత్తగా ఏదో ట్రై చేయడం ఎందుకూ? రిస్క్!' అనేవారు. నేను ఎంత కాదనుకున్నా... రాహుల్‌కి అవే జీన్స్ వచ్చాయి. నువ్వు నాకు పరిచయం అయ్యాకా పీజీ చేసావు. డాన్స్ కాంపిటీషన్స్‌కి వెళ్లావు. రెండు ఫారెన్ లాంగ్వేజెస్ నేర్చుకున్నావు. మా సంప్రదాయం ప్రకారం పూజలూ పిండివంటలూ అన్నీ నేర్చుకున్నావు. నీలో ఆ తపన, ఆ ఆశ వుంది. వాడు ఎంబీఏ తర్వాత ఏం చేశాడు? ఏమీ చెయ్యలేదు. కేవలం నిన్ను ప్రేమించాడు. ఒకేసారి ఆడది ఇన్ని పనులు సునాయాసంగా చేస్తున్నప్పుడు ఈ మగాళ్లు కేవలం ఆఫీసు పనులతోనే ఎందుకు అలసిపోతున్నారూ? అన్నిటికీ 'టైం లేదు' అనే ఎక్స్‌క్యూజ్ ఎందుకు చెప్తారూ? అదే.. కంపెనీలో సాయంత్రం దాకా నిలబడి పనిచేసిన ప్యాకింగ్ గర్ల్ ఇంటికెళ్లేటప్పుడు కూరలు కొనుక్కుని వెళ్తుంది. ఇంట్లోకి వెళ్తూనే పిల్లలకీ, భర్తకీ వండి పెడుతుంది. కానీ ఎంతమంది మగాళ్లు ఒక పక్క వంట చేస్తూ ఇంకో పక్క పిల్లలకి పాఠాలు చెప్తూ రాత్రికి చెయ్యాల్సిన వంట గురించి ప్లాన్ చేసుకోగలరు? వంట చేసేవాడు ఆఫీసులకి వెళ్లనంటాడు. ఆఫీసుకి వెళ్లొచ్చేవాడికి మంచి నీళ్ల దగ్గరనుంచీ అందించాలంటాడు.

రాహుల్ సుఖంగా, కులాసాగా కాలక్షేపం చేసేసే టైప్. ఒక పనే కరెక్ట్‌గా చెయ్యగలడు. అది నీకు భర్తగా వుండడం. నీకు కాంపిటీటర్‌గా మాత్రం వుండలేడు. నాకు జీవితంలో సరయిన పోటీ లేక నేనే అస్తమానం గెలుస్తూ ఇలా మిగిలిపోయాను. నా భర్త ద్వారా ఓటమి ఒక్కసారి రుచి చూడాలని తపించిపోయాను. ఆ విషయంలో ఓడిపోయాను. పూర్తిగా ఓడిపోయాను. ఇప్పుడిక రాహుల్‌ని లైఫ్ పార్టనర్‌ని చేసుకోవడంలో నిర్ణయం నీదే! నువ్వేం చేసినా నాకు ఇష్టమే.. ఇన్‌ఫాక్ట్ నిన్ను వదులుకోవడం నాకు ఇష్టం లేదు అస్మితా''

చివరి మాట చాలా ప్రేమగా వచ్చేసింది.

అస్మిత కన్నీళ్లతోనే నవ్వింది.


''థాంక్యూ ఆంటీ. మీరన్నది కరెక్టే. చాలా సీరియస్ ప్రాబ్లమే. ఆలోచిస్తాను.'' అని లేచి వెళ్లిపోయింది.

★ ★ ★

అస్మిత రావడం మానేసింది.

రాహుల్ మంచం పట్టాడనుకున్నాను.

కానీ పట్టుదలగా 'గేట్' ఎగ్జాం రాసి అమెరికా వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటుంటే తెలిసింది... అస్మితకీ ఈ దేవికకీ మధ్యనున్న తేడా!



## టాబూ ఫ్రెండ్

**'గ్రీకువీరుడు నా రాకుమారుడు..' అంటూ కుర్రకారు గుండెల్ని గుల్ల చేసిన టాబూకి ఓ మంచి ఫ్రెండ్ దొరికినట్టున్నాడు. ఆమె షూటింగ్స్‌లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ డైరెక్టర్ మాధుర్ భండార్కర్‌తో పిచ్చాపాటీ మాట్లాడడం మాత్రం మానడం లేదట. సట్టా సినిమా మిక్సింగ్‌తో క్షణం తీరికలేకుండా ఉన్న మాధుర్ ఈమెతో మాట్లాడడానికి మాత్రం ఎంత టైమైనా కేటాయిస్తున్నాడట. షూటింగ్స్‌తో అలసిసొలసిన టాబూ మాధుర్‌ని కలిస్తే అన్నీ మరచిపోతోందిట! మాధుర్ ఇప్పుడు రవీనాని వదిలి టాబూ చేయి పట్టుకున్నట్టున్నాడు అంటున్నారంతా.**

★ ★ ★

''హేపీ న్యూ ఇయర్ ఆంటీ'' అస్మిత నా బుగ్గ మీద ముద్దు పెట్టింది.

మా రాహుల్ పక్కన ఆనందంగా, ఉత్సాహంగా వుంది.

''కమాన్ లెటజ్ డాన్స్...'' ఇద్దర్నీ దగ్గరకి తీసుకుంటూ అన్నాను.

ఎంత అందమైన స్వాగతం ఈ కొత్త సంవత్సరానికీ... సుకుమారమైన గులాబీకి కింద సన్నని ముల్లు ఎంత అందమైన బాలెన్స్... ఈ సృష్టిలో.

☆